ప్రజాశక్తి
ఆదివారం 9 నవంబర్ 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఘనంగా ఆశాల రాష్ట్ర మహాసభ



సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

- అనకాపల్లిలో భారీ ర్యాలీ, సభ
- ఎరుపెక్కిన పట్టణం
- ప్రభుత్వాలు కార్మికుల పక్షమా ? కార్పొరేట్ల పక్షమా ? : పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి
- తొలిరోజు కనీస వేతనాలు, పర్మినెంట్ అంశంపై తీర్మానం ఆమోదం

ప్రజాశక్తి - అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఐదో రాష్ట్ర మహాసభ అనకాపల్లి వేదికగా శనివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక వర్తక సంఘం కర్రి రమేష్ కల్యాణ వేదికలో నాగలక్ష్మి నగర్‌లో రెండు రోజులపాటు తలపెట్టిన ఈ మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభ నేపథ్యంలో తొలుత అనకాపల్లిలోని సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, నెహ్రూ చౌక్ జంక్షన్, మెయిన్ రోడ్ మీదుగా నాలుగు రోడ్లు జంక్షన్ వరకూ భారీ ప్రదర్శన చేపట్టారు. ఎర్రజెండాలు చేబూని ఆశా కార్యకర్తలు ఈ ర్యాలీలో కదంతొక్కారు. నాలుగు రోడ్ల జంక్షన్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథి పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి కీలక ప్రసంగం చేశారు.

అనంతరం నాగలక్ష్మినగర్‌లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. అరుణ పతాకాన్ని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సత్యవతి ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి, నాగలక్ష్మి, రంజన నిరులకు ప్రతినిధులు అరుణాంజలి ఘటించారు. సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. తదుపరి ప్రారంభమైన ప్రతినిధుల సభలో గోపిమూర్తి మాట్లాడుతూ స్కీం వర్కర్లకు నేటికీ అరకొర వేతనాలే దక్కుతున్నాయన్నారు. వారి వేతనాలను పెంచని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు మాత్రం లక్షల కోట్ల రూపాయలు రాయితీలు, పన్ను మినహాయింపులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి, అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటలూ పని చేయాలని ఒత్తిడి తేవడం సరికాదన్నారు. ఇటీవల వచ్చిన మొంథా తుపానులో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలే ఎక్కువగా సేవలు అందించారని గుర్తు చేశారు. ఓటు వేసి గెలిపించిన ప్రభుత్వాలు కార్మికుల పక్షాన కాకుండా కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. శాసన మండలి, శాసనసభలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. కార్మికుల



అనకాపల్లిలో సాగుతున్న ఆశాల భారీ ర్యాలీ

కెజిహెచ్‌లో రూ.40 కోట్లతో అతిపెద్ద ఒపి బ్లాక్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కెజిహెచ్‌లో రూ.40 కోట్లతో అతిపెద్ద ఒపి బ్లాక్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కెజిహెచ్‌కు వచ్చి అక్కడి తాజా పరిస్థితిలను సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కెజిహెచ్‌లో రెండేళ్లతో పోలిస్తే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. దీంతో కెజిహెచ్‌లో ఎక్కడ, ఏం జరుగుతుందో ఇట్టే తెలుస్తోందన్నారు. మందులు ఇచ్చే ప్రాంతంలో రోగులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. మైకులు పెట్టామన్నారు. 14 ఆర్‌ఒ ప్లాంట్‌లను ఏర్పాటు చేశామన్నారు. 13 వెంటిలేటర్లను రప్పించామన్నారు. రూ.5,6 కోట్లతో గుండెకు సంబంధించిన పరికరాలను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి బ్లాకులో ఎసి సదుపాయం కల్పించామని చెప్పారు. కెజిహెచ్ రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. ఆసుపత్రిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మొద్దన్నారు.

పనుల్లో పొరపాటు వల్లే విద్యుత్ అంతరాయం

పనుల్లో పొరపాటు వల్లే ఇటీవల కెజిహెచ్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, ఇది మిగతా 2లో..

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

వార్త 5లో..

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను తిప్పికొట్టాలి

వార్త 8లో..

విద్యా వ్యవస్థ మెరుగునకు కృషి చేయాలి

వార్త 8లో..



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: నగరంలో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా కాన్వెంట్ జంక్షన్ నుంచి పోర్టుడాక్ ఏరియా వరకూ చేపడుతున్న రోడ్డు పనులను జివిఎంసి, ఎన్‌హెచ్ విభాగాల అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. భాగస్వామ్య సదస్సు నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జివిఎంసి సిఇ సత్యనారాయణ రాజు, ఎస్ఇ జాతీయ రహదారుల విభాగం అధికారులు ఉన్నారు.

అంతటా భద్రత ప్రశ్నార్థకం !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'జీవంలో ఉన్నవన్నీ మరణించాల్సిందే!.. అయితే బలవన్మరణాలు, ప్రమాద మరణాలు, హత్యలు, ఇతరత్రా మృత్యువు గురించి కాదు' - అని ప్రపంచ రచయిత షేక్స్‌పియర్ చెప్పాడు. 'నిశ్శబ్దం..దేవుడు అక్కరలేని దేవాలయం' అంటాడు మరో రచయిత రాబర్టో జువరోజ్. అయితే అకాల మరణాలకు అనేక కారణాలుంటాయి. కొన్ని సందర్భాల్లో పాలించే వారూ దీనికి కారణం. అలాంటి సందర్భాల్లో ప్రభుత్వం బోనులో నిలబడాల్సిందే. కొన్ని ఘటనలు (మరణాలు)ను పరిశీలిస్తే ప్రభుత్వ పెద్దలను బోనులో నిలబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మధ్య కాలంలో ఏ నోట విన్నా గుడిలో ప్రమాదాలు, రోడ్డుపై గాడి (బస్సు) ప్రమాదాల గురించి ఒకటే చర్చ. ఈ రెండు పేర్లెత్తితే జనం బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా ప్రజలు అత్యంత ఇష్టదేవతల గుళ్ళు, గోపురాల వద్ద జరుగుతున్న ప్రమాదాలైతే ఇక చెప్పనవసరం లేదు. సింహాచలంలోని గోడ కూలి మృతిచెందిన వారి కుటుంబ కన్నీళ్ల తడి ఇంకా ఆరనేలేదు. నిన్నటికి నిన్న శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన చోటుచేసుకుంది. తొమ్మిది మంది మృతిచెందారు. అంతకు ముందు తిరుపతి వేంకటేశ్వరుని సన్నిధిలోనూ ఈ తతంగమే



చోటుచేసుకుంది. వీటన్నింటా జనం రోదనలు మిన్నంటాయి. పదుల సంఖ్యలో భక్తులు అకాల మరణం చెందారు. ఇలా వేర్వేరు చోట్ల ప్రజలపై గుడిలోనూ, గాడి (బండి, బస్సు)లోనూ జరిగిన ప్రమాదాలు జనంలో తీవ్రమైన భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

బస్సుల్లోనూ ఇదే వ్యథ

మరోవైపు లైసెన్సుల్లేని, అధికార రాజకీయ పార్టీల అండదండలతో లెక్కకు మిక్కిలి భారీ బస్సులు హైవేల్లో రక్తమోడుతున్న సంగతి తెలిసిందే. ప్రైవేట్ బస్సులకు ఇస్తున్న పర్మిట్ల వెనుక రాజకీయ పెద్దల సిఫారసులే కారణమని ఆర్‌టిఒ అధికారులు సైతం బహిరంగంగా లబోదిబోమంటున్నారు. అయినా సరే పాలకుల్లో ఎలాంటి మార్పూ రావడం లేదు. విశాఖ ఉమ్మడి జిల్లాల్లోని అనకాపల్లి - అచ్యుతాపురం - రాంబిల్లి ఫార్మా సెజ్‌లకు చెందిన వందల సంఖ్యలో బస్సులు ఉదయం, సాయంత్రం రోడ్లపై ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు రోడ్డెక్కేందుకు భయపడుతున్నారు. ఫార్మా కంపెనీల బస్సులతో జనానికి అవస్థలు తప్పడం లేదు. బస్సు ప్రమాదాలకు రాష్ట్రంలో కొదవే లేదు. ప్రతిరోజూ ఏదో ఒక మూలన బస్సు ప్రమాదాల్లో మృతుల సంఖ్య భారీగానే ఉంటుంది. కర్నూలు బస్సు ప్రమాదం ప్రయాణికులకు భద్రత కొరవడిన అంశాన్ని పట్టిచూపింది. ఇవన్నీ పాలకుల హత్యలే !!!

మొదటి పేజీ తరువాయి..

కెజిహెచ్‌లో రూ.40 కోట్లతో అతిపెద్ద ఒపి బ్లాక్

యాజమాన్యం, ప్రభుత్వ వైఫల్యం కాదని వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. క్రిటికల్ కేర్ వద్ద వాటర్ పైపులైన్ల పనులు చేస్తుండగా జెసిబి బకెట్ తగిలి దిగువన ఉన్న విద్యుత్ కేబుల్ లైన్లు తెగిపోయాయని తెలిపారు. దీని వల్ల మధ్యాహ్నం రెండు గంటల నుంచి కొన్ని విభాగాలలో విద్యుత్ సరఫరా నిలిచిందన్నారు. అదే సమయంలో దేవి అనే మహిళ సీరియస్ కండిషన్లో ఆసుపత్రిలో చేరిందని, ఆమె అనారోగ్యంతో మృతి చెందిందే తప్ప, విద్యుత్తు లేనందున మృతి చెందలేదని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసిపి నాయకులు నోటికి వచ్చినట్లు ప్రకటనలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు.

రేడియాలజీపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: రేడియాలజీ పట్ల ప్రజల్లో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర రేడియాలజిస్టుల సంఘం అధ్యక్షులు డాక్టర్ సురేష్ అన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా శనివారం కెజిహెచ్‌లో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం నిర్వహించారు. విశాఖపట్నంలోని రేడియాలజిస్టులు, రేడియోగ్రాఫర్లు ఉత్సాహంగా పాల్గొని ఎక్స్‌రే ఆవిష్కర్త డాక్టర్ రాంట్‌జెన్‌కి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో రేడియాలజీ సేవల పట్ల అవగాహన తీసుకురావాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ, రేడియాలజీ సేవల కోసం ఎంతో డిమాండ్ ఉన్నప్పటికీ కెజిహెచ్ లో మంచి సేవలు అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఇంకా మెరుగైన సేవల కోసం ప్రయత్నం చేయాలన్నారు. రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు రేడియాలజీ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సమావేశంలో రేడియాలజీ ఫ్యాకల్టీ, రేడియోగ్రాఫర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాజు మృతి తీరని లోటు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాలాంధ్ర విశాఖపట్నం బుక్‌హౌస్ మేనేజర్ పోలవరపు అప్పలరాజు (పి.ఎ.రాజు) సంస్మరణ సభ శనివారం విశాఖ లక్ష్మిటాకీస్ దరి ఆంగ్లో ఇండియన్ కల్యాణ మండపంలో జరిగింది. సిపిఐ జాతీయ సమితి సభ్యుడు జె.విసత్యనారాయణమూర్తి పాల్గొని మాట్లాడుతూ, చిన్న వయస్కుడైన రాజు మృతి పార్టీకి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌కు తీరని లోటు అని నివాళులు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు నాయకులు ఎస్.మురళి, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: న్యాయసేవాధికార చట్టం 1987పై అర్హత కలిగిన వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు అన్నారు.శనివారం జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయసేవా వారోత్సవాల్లో భాగంగా న్యాయఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు (వార్షిక ఆదాయం రూ.3 లక్షలు లేదా అంతకంటే తక్కువ), మహిళలు, పిల్లలు, షెడ్యూల్డ్ కులాలు,తెగలు, వికలాంగులు మొదలైనవారికి ఉచిత చట్టపరమైన సలహా, న్యాయ సహాయం, కోర్టు ఫీజులు ఉచితంగా అందుతాయని తెలిపారు. ఈ పథకాలు లోక్ అదాలత్ ద్వారా వివాదాలు పరిష్కరించడం, పారాలీగల్ వాలంటీర్లతో సహా చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా కేసులు ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకట రమణ,ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.రాధారత్నం,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు సంప్రదాయ చేనేత వస్త్రాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వివాహాది వేడుకలవేళ భారతీయత ఉట్టిపడే సంప్రదాయత నిండిన వేలాదిరకాల పట్టు, నేత చీరలనేషనల్ సిల్క్ ఎక్స్‌పో, ఎగ్జిబిషన్ కమ్‌సేల్ వస్త్ర ప్రదర్శన హోటల్ గ్రీన్‌పార్కులో ప్రారంభమైంది. ఈ నెల 11 వ తేదీ వరకూ నిర్వహిస్తున్న ప్రదర్శనలో షాపింగ్ చేయటం గొప్ప అనుభూతిని కలిగిస్తుందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి సేకరించిన మగ్గాల ఉత్పత్తులు అన్నింటిని ఒకచోట ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శనలో వేలాదిరకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు మొదలైనవి 50 శాతం వరకు తగ్గింపుతో ఒకేచోట అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 11నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని,ప్రవేశం ఉచితం అన్నారు.

గర్భిణులకు చీరల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: సత్యసాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మురళినగర్ శ్రీసత్యసేవా సమితి భజన మండలి ఆధ్వర్యంలో, శనివారం కెజిహెచ్ గైనిక్‌వార్డు నందు 65 మంది గర్భిణులకు చీర, గాజులు, పసుపు, కుంకుమ, స్వీట్లు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమం శ్రీ సత్యసేవాసమితి భజన మండలి సభ్యులు ఇందిర, ఎస్.నాగమణి, ఉమాదేవి, శారద అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కెజిహెచ్. గైనిక్ విభాగాధిపతి డాక్టర్ జి.సౌమిని, డాక్టర్ శైలజతో పాటు ఇతరవైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి శ్రీ సత్యసేవా సమితి భజన మండలి వారిని అభినందించారు.

ఘనంగా ఆశాల రాష్ట్ర మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న ధనలక్ష్మి



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

(మొదటి పేజీ తరువాయి..) పని గంటలను 8 నుంచి 10 గంటలకు పెంచినా దీనిని ప్రశ్నించలేని స్థితిలో ప్రతిపక్ష వైసిపి ఉందన్నారు. సిఐటియు సారథ్యంలో ఉద్యమ సంఘాలలో అంగన్వాడీ, ఆశా వర్కర్ల యూనియన్లు మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఆశాల ఉద్యమాల ఫలితంగా పలు జీవోలు, సర్క్యులర్లు వచ్చాయన్నారు. ప్రజలు, కార్మికులు ఆలోచించి వారికోసం ఎర్ర జెండాపై పనిచేసే వారిని గెలిపించాలని కోరారు. తద్వారానే కార్మిక, కర్షక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఆశాలు ఉద్యమించినప్పుడు ఉద్యోగాలు తొలగిస్తామని ప్రభుత్వాలు బెదిరించాయని, వాటికి బెదరకుండా తమ జోలికొచ్చిన ప్రభుత్వాలను ఆశాలు దించేశారని తెలిపారు. కేరళ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపజేయడం వంటి చర్యలతో ముందుందన్నారు. ఆ రాష్ట్రాన్ని చూసైనా మన ప్రభుత్వం పనిచేయాలన్నారు.

ప్రతినిధుల సభకు అధ్యక్ష వర్గంగా ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ, పి.ధనశ్రీ, వి.సత్యవతి, డి.అన్నపూర్ణ, రమణ కుమారి వ్యవహరించారు. కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కృష్ణా జిల్లా ప్రతినిధి పి.ధనశ్రీ తీర్మానం ప్రవేశపెట్టగా పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధి డి.జ్యోతి బలపరిచారు. ప్రతినిధులు ఆమోదించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి 2022లో జరిగిన సంఘం నాలుగో మహాసభ నుంచి నేటి వరకు జరిగిన పోరాటాలను, అనుభవాలను తెలియజేస్తూ మహాసభ నివేదికను ప్రవేశపెట్టగా మహాసభ ఆమోదించింది.

వ ం వ ా న బ

తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా విశాఖకు చెందిన పి.మణి, మినిట్స్ కమిటీ కన్వీనర్‌గా విజయనగరానికి చెందిన డి.సుధారాణి, అర్హతల కమిటీ కన్వీనర్‌గా ఎం.వాణిశ్రీ వ్యవహరించారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు, ఆశాల యూనియన్ నాయకులు కమల, శాంతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఆశా కార్యకర్తలు



ఆకట్టుకున్న ఆశాల కోలాట ప్రదర్శన

స్టేషన్ తరలించారు.. వాహనాలు వదిలేశారు...

- సీజ్ చేసిన వెహికల్స్‌తో నిండిపోయిన సచివాలయ ప్రాంగణం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



సీజ్ చేసిన వాహనాలతో నిండిపోయిన సచివాలయ ప్రాంగణం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ కాలనీలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను విమ్స్ ఆసుపత్రి సమీపంలో సొంతంగా కట్టుకున్న భవనంలోకి తరలించారు. అంతవరకు బాగానే ఉంది. పాత పోలీస్‌స్టేషన్ ప్రాంగణంతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న సామాజిక భవనం, సచివాలయాల ప్రాంగణాల్లో సీజ్ చేసిన వాహనాలను ఉంచేశారు. అప్పట్లో ఆరిలోవ పోలీస్‌స్టేషన్ ఒకే గదిలో ఉండేది. సీజ్ చేసిన వాహనాలు మాత్రం వందల సంఖ్యలో ఉన్నాయి. ఇలా సీజ్ చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌ను ఆనుకొని ఉన్న తుపాన్ బిల్డింగ్, సచివాలయాల ప్రాంగణంల్లో ఉంచారు. ఇదే ప్రాంగణాల్లో 1, 2, 22 నెంబరు గల మూడు సచివాలయాలు, ఒక సామాజిక భవనం ఉన్నాయి. ఈ ప్రాంగణాలు సీజ్ చేసిన వాహనాలతో చిందర వందరంగా తుప్పు పట్టిపోయి కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. దీనితో సచివాలయాలకు వచ్చే వారు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాల ఉద్యోగులు, సచివాలయాలకు వచ్చే వారి వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు కనీసం స్థలం కూడా లేదు. ప్రాంగణాన్ని శుభ్రం చేయడానికి కూడా వీలు లేకుండా పోయింది. దీంతో ప్రాంగణం అంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా ఈ వాహనాలను ఇక్కడి నుంచి తరలించాలని, సచివాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

కొబ్బరి చెట్టు నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామంలో శనివారం కొబ్బరి చెట్టు మీద నుండి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వడ్డాది రెల్లివీధికి చెందిన ముత్యాలు శ్రీను వడ్డాది సెంటర్లో కొబ్బరి కాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పొట్టిదొరపాలెంలో కొబ్బరి బొండాలు దించడానికి శ్రీను చెట్టు ఎక్కాడు. ప్రమావశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో స్థానికులు వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందాడు. శ్రీనుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు బుచ్చయ్యపేట ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధి సాయినగర్ కాలనీలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... సాయినగర్ కాలనీకి చెందిన పితాన స్వాతి (29) బ్యూటీషన్‌గా పని చేస్తున్నారు. మ్యారేజ్, మెచ్యూర్ ఫంక్షన్‌లకు మేకప్‌లు వేసేవారు. ఆమె భర్త చిరంజీవి మధురవాడలో ఓ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. వీరి మధ్య కొంత కాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి భర్త చిరంజీవి, స్వాతి ఇద్దరు వేర్వేరుగా రెండు గదుల్లో పడుకున్నారు. చిరంజీవి శనివారం ఉదయం స్వాతి పడుకున్న గది తలుపు కొట్టగా ఆమె ఎంతకీ తలుపు తీయకపోవడంతో తలుపు విరగ్గొట్టి లోపలకు వెళ్లే సరికి స్వాతి ఉరివేసుకొని మృతి చెంది ఉంది. దీంతో వెంటనే చిరంజీవి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి స్థానిక సిఐ జి.రామచంద్రరావు సిబ్బందితో చేరుకొని విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు తల్లి యర్ర వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి రామచంద్రరావు తెలిపారు. కాగా మృతురాలికి వెంకట కార్తీక్ (13) మోక్షిత్ (7) కుమారులు ఉన్నారు.



గంజాయితో పట్టుబడ్డ నిందితుడు

10 కేజీల గంజాయితో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: 10 కేజీల గంజాయితో నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని గొలుగొండ ఎస్సై పీ.రామారావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు శనివారం మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామ శివారులో కృష్ణదేవిపేట నుండి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని మాటు వేసి పట్టుకున్నామన్నారు. ఆ వ్యక్తి వద్ద ఈ గంజాయిని స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన ఆకాశ్ బౌరావ్ గోరేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, అతని వద్ద బైక్, ఒక మొబైల్ ఫోన్ స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. అల్లూరి జిల్లా పరిధిలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి సోలాపుర్ ప్రాంతంలో ప్యాకెట్లు రూపంలో ఎక్కువ ధరకు విక్రయించేవాడని విచారణలో తేలిందన్నారు.

జూ పార్కులో ఎలుగుబంటి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో 12 ఏళ్ల వయసు గల ఆడ స్లాత్ బేర్ శనివారం ఉదయం మృతి చెందింది. గర్భాశయంలో మమ్మీ ఫైడ్ పిండం మిగిలిపోయిన గర్భం వల్ల ఏర్పడిన సెప్టీసేమిక్ షాక్ కారణంగా మృతి చెందినట్టు జూ వెటర్నరీ వైద్యులు నిర్ధారించినట్టు క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. గత నాలుగు రోజుల క్రితమే ఈ విషయం గుర్తించిన వైద్యులు వైద్య సేవలందించినప్పటికీ మృతి చెందడం బాధాకరమని జూ క్యూరేటర్ పేర్కొన్నారు.

ఇత్తడి సేకరణ

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లిలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి సహిత మల్లేశ్వర స్వామి దేవాలయం పీఠానికి 18 మెట్లకు, గజ స్థంభమునకు గ్రామంలో స్థానిక సర్పంచ్ గంటా జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఇత్తడిని శనివారం సేకరించారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి -తగరపువలస : విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు పట్టుదలతో కృషి చేయాలని పలువురు వక్తలు విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక అవంతి డిగ్రీ కళాశాలలో శనివారం ప్రెస్సర్స్‌డే వేడుకలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్రిన్సిపల్ పిన్నింటి రామకృష్ణ అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.రామకృష్ణ మాట్లాడుతూ, కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అందుకోగలమన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ సిడిసి డీన్ డాక్టర్ టివి.కృష్ణ మాట్లాడుతూ, చదువులో నైపుణ్యం ఉంటే ఎక్కడైనా రాణించగలరని చెప్పారు. భోగాపురం ఎస్ఐ కె.దుర్గాప్రసాద్, భీమిలి ఎస్ఐ ఎం.భరత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. చెడు వ్యసనాల బారిన పడొద్దని, ర్యాగింగ్ జోలికి వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని చెప్పారు. బ్రహ్మకుమారీ పార్వతి మాట్లాడుతూ, విద్యార్థులు సోదర భావంతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు షీల్డులు, ప్రశంసా పత్రాలను అందచేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయ. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దామోదర బాబాజీ

ప్రజాశక్తి- తగరపువలస : చిట్టివలస జూట్ మిల్ పెన్షనర్ల సమస్యలపై విశాఖపట్నం పిఎఫ్ ప్రాంతీయ కమిషనర్ అవినాష్ కుమార్‌కు పెన్షనర్ల సంఘం జిల్లా సెక్రెటరీ ఎస్‌కె.హుస్సేన్‌తో కలిసి సంఘం కార్యదర్శి దామోదర్ బాబాజీ శనివారం వినతిపత్రం అందించారు. ఆరేళ్ల నుంచి కన్సన్ 10 డి ఫారమ్ ఫార్వర్డ్ అవ్వడం లేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో చేపించుకోవాలని పిఎఫ్ సంస్థ చెబుతోందని, చిట్టివలస జూట్ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉంటుందని, మీరు చొరవ చూపి తగిన ఆదేశాలు ఇచ్చి పెన్షన్ వచ్చేటట్టుగా చేయాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మోర అప్పలరాజు తదితరులు ఉన్నారు.

'శ్రీకృష్ణ' విద్యార్థులకు యూనిఫాం



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ప్రిన్సిపల్ బి.నరసింగరావు

ప్రజాశక్తి- తగరపువలస

స్థానిక బొగ్గు రోడ్డులో ఉన్న శ్రీకృష్ణ డిగ్రీ కళాశాల స్థాపించి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులు 70 మందికి రూ.70 వేలు విలువచేసే రెండు జతల యూనిఫామ్‌ను కళాశాల చైర్మన్ బి.నర్సింగరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో ప్రతిభ



రెజ్లింగ్‌లో ప్రతిభ చూపిన ఆదిలక్ష్మిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్‌టిఆర్ జిల్లాలో ఈ నెల 4, 5 ,6 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.ఆదిలక్ష్మి (8వ తరగతి) 43 కేజీలు విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి.అచ్యుతరావు తెలిపారు. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయులు డి.ఆదినారాయణ అభినందించారు.



పక్కకు వంగిన విద్యుత్ స్తంభం

వంగిన విద్యుత్ స్తంభం

ఫిర్యాదు చేసిన సిఐటియు

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ ఆంజనేయ గుడి ఎదురుగా పక్కకు వంగిన విద్యుత్ స్తంభంపై స్టీల్ అడ్మిన్ ఎలక్ట్రికల్ విభాగంలో సిఐటియు నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. స్తంభం కింద పూర్తిగా విరిగి వంగిపోయిందని, కేవలం విద్యుత్ వైరు ఆధారంగా వంగి నిలబడిందని వివరించారు. ఆ రహదారిలో రాకపోకలు చేసే కార్మికులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఫిర్యాదుపై అడ్మిన్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది వచ్చి పరిశీలించారు. సరిచేస్తామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సిఐటియు నాయకులు నమ్మి రమణ, డి.వెంకట్రావు, స్థానిక నాయకులు గొందేసి అప్పలరెడ్డి ఉన్నారు.

టీకాలపై అపోహలు తొలగాలి

ప్రజాశక్తి- గాజువాక : టీకాలపై అపోహలు తొలగాలని షీలానగర్‌లోని కిమ్స్ కడల్స్ ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్సలు చేయించుకోవడం కంటే, ఆ వ్యాధులు దరిచేరకుండా టీకాలు వేయించుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి పెద్ద వారి వరకు ప్రతి ఒక్కరూ టీకాలు వివిధ వయసులో కచ్చితంగా వేయించుకోవాలని సూచించారు. టీకాలపై ప్రజల్లో చాలా అపోహలు ఉన్నాయని, టీకాలు వేయించడం ద్వారా జ్వరాలు రావడం, బలహీనత పడతారని అపోహలతో దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నవంబర్ 10వ తేదీన అంతర్జాతీయ టీకాల దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా టీకాలుపై అపోహలు తొలగించడం, వాటి ప్రాముఖ్యతను వివిధ కార్యక్రమాల ద్వారా తెలియజేస్తారని వివరించారు. ఈ సంవత్సరం అందరికీ రోగనిరోధకత సాధ్యమే అనే థీమ్‌తో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. భారతదేశం యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం ఏటా లక్షలాది శిశువులకు, గర్భిణులకు ఉచిత టీకాలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా ఆరోగ్య కార్యక్రమంగా నిలుస్తోందని పేర్కొన్నారు. భౌగోళిక అడ్డంకులు, పేదరికం, అపోహలు, అంతరాయాలతో కొందరికి టీకాలు అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దీని కోసం ప్రభుత్వం, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ కలిసిపని చేయాలని సూచించారు.

డిసెంబర్ 12న గీతం స్మార్ట్ ఐడియాథాన్ పోటీలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి "స్మార్ట్ ఐడియాథాన్-2025" పేరిట పోటీలను డిసెంబర్ 12వ తేదీన నిర్వహించనున్నట్లు గీతం విడిసి కోచ్ వికాస్ తెలియజేసారు. ఈ పోటీలకు అమెరికాలోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎడ్యుకేషన్, సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సహకారం అందిస్తున్నాయని తెలిపారు. దేశంలోని విద్యార్థులలో స్టార్టప్ ఆలోచనలను ప్రోత్సహించడానికి వీలుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ స్మార్ట్ ఐడియాథాన్ పోటీల్లో పాల్గొనే జట్లు ఆహారం, వ్యవసాయం, హరిత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యర్థాల నిర్వహణ, ఆరోగ్య సంబంధ సాంకేతిక పరిజ్ఞానం, నీటి వనరుల నిర్వహణ వంటి అంశాలపై నూతన ఆవిష్కరణలను స్టార్టప్‌లుగా మలిచే కృషి జరుగుతుందని పేర్కొన్నారు. గీతం విద్యార్థులే కాకుండా దేశంలోని ఏ ప్రాంతంలోని యువత, విద్యార్థి బృందాలు అయినా ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన జట్లును అమెరికాలోని బోస్టన్‌లో జరిగే పోటీలలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తామని, అమెరికాలోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ ఏడాది పోటీలలో సోషల్ ఇన్నోవేటర్స్, ఉమెన్ ఎంట్రప్రెన్యూర్ విభాగాలను ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు పోటీలలో పాల్గొనడానికి ఈ నెల 11వ తేదీలోగా తమ ఆలోచనలకు సంబంధించిన వివరాలను, తమ ఆలోచనలను ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం గీతం విడిసి వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి నోచలేదు

మందుబాబులకు అడ్డాగా మారిన భవనం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి రెల్లివీధిలో గత వైసిపి ప్రభుత్వం హయాంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన జి ప్లస్ టు భవనం ప్రారంభానికి నోచుకోలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రారంభానికి నోచుకోవడం లేదని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత మేయర్ హరి వెంకట కుమారి శంకుస్థాపన ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం పూర్తయింది. ప్రారంభానికి నోచుకోకపోవడంతో కొంతమంది ఆకతాయిలు రాత్రిపూట మద్యం తాగి భవనాన్ని తమ అడ్డాగా మార్చుకుంటున్నారు. మందు బాబుల వికృత చేష్టలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మద్యం తాగి ఆ సీసాలను పగులగొట్టి రోడ్డుపై పడేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, స్థానిక కార్పొరేటర్‌కు, పోలీసులకు పలుమార్లు సమస్యను వివరించినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం పూర్తయితే ఒక ఫ్లోర్లో డ్వాక్రా మహిళలకు, మరొక ఫ్లోర్లో అంగన్‌వాడీ కేంద్రం, మరొక ఫ్లోర్లో కల్యాణ మండపం ఏర్పాటు చేస్తే కాలనీవాసులకు అనుకూలంగా ఉంటుందని భావించామని, ప్రారంభం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



మందుబాబులు తాగి పడేస్తున్న సీసాలు



నిర్మాణం పూర్తిచేసుకున్న భవనం

రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గాజువాక : 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 కోట్లతో గాజువాక కాకతీయ జంక్షన్ నుండి పెద గంట్యాడ జంక్షన్ వరకు విస్తరణ పనులకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధిని ప్రజలు స్వాగతించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచని ఈ రహదారి విస్తరణ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని చెప్పారు. విస్తరణ పనుల వల్ల రోడ్డుకిరువైపులా ఉన్న చిన్న వ్యాపారులకు ఇబ్బంది కలిగినా అందరి మంచికోసం చేస్తున్నట్టుగా భావించాలని కోరారు. కాకతీయ కూడలి నుంచి జింక్ గేట్ వరకు, పెదగంట్యాడ గాంధీ కూడలి నుంచి గంగవరం, గంగవరం పోర్టు నుంచి పాత కర్ణవానిపాలెం వై జంక్షన్ వరకు ఉన్న రోడ్లను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం ఈ రెండింటినీ సమపాళ్లలో చూస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై మాట్లాడుతూ, ప్రజల అభిప్రాయమే తన అభిప్రాయంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, కార్పొరేటర్లు బొడ్డు నరసింహ పాత్రుడు, తిప్పల వంశీరెడ్డి, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, పులి రమణారెడ్డి, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు, మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లతో యువతకు ఉపాధి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లు యువతకు ఉపాధిని కల్పిస్తున్నాయని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఎపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్‌కు గాజువాక ఆటో నగర్‌లో కేటాయించిన స్థలంలో శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉన్న ఈ సంస్థలు చాలామందికి శిక్షణ ఇచ్చి విదేశాలకు ఉద్యోగాలకు పంపించిన చరిత్ర ఉందన్నారు. వారి కోరిక మేరకు అసోసియేషన్‌కు ఆటోనగర్‌లో స్థలం కేటాయించినట్లు తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, గాజువాక సిఐ పార్థసారథి, అసోసియేషన్ అధ్యక్షుడు కరణం కనకారావు, ప్రధాన కార్యదర్శి చట్టి వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు ఎస్.పరదేశి, సిహెచ్.పాపారావు, సిహెచ్.ప్రసాద్, బోండా అచ్చిబాబు, నడవరపు రమణ, మురళీ, శ్రీహరి, అంజి బాబు, గిరి, బాలు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు హెచ్‌ఆర్‌డి జిఎం మధుసూధనరావు తెలిపారు. బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఉక్కు హౌస్ హెచ్‌ఆర్‌డి నాగార్జున హాల్లో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సహకారంతో స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వుమెన్స్ అండ్ హెల్త్ కేర్' అంశంపై సుమారు 35 మంది వర్కింగ్ ఉమెన్‌ల కోసం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ అంశాలు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. సెమినార్‌కు ఫ్యాకల్టీగా విఎస్‌జిహెచ్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ గుత్తాల సుజాత, సమన్వయకర్తగా హెచ్‌ఆర్‌డి విభాగం నుండి రమేష్ వ్యవహరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, లైసెన్సింగ్ ఆఫీసర్లు నల్లి సుందరం, బాబు నాయక్, సెల్ ఆఫీసర్ ఎన్‌ఎస్‌ఆర్‌ఎం.ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఆర్‌డి జిఎం మధుసూధనరావు



నాగప్రియను అభినందిస్తున్న గణబాబు

నాగప్రియకు గణబాబు అభినందనలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : గత నెల 31న జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా పార్లమెంట్‌లో ప్రసంగించడానికి పెందుర్తి మండలం రాంపురం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని నాగప్రియ ప్రత్యేకంగా ఎంపికై అద్భుతంగా ప్రసంగించినందుకు ఎమ్మెలే గణబాబు శనివారం సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆమె ప్రసంగానికి చాలామంది ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపించారని పేర్కొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 14 వార్డు పరిధి నరసింహనగర్ రైతు బజార్ వద్ద వైసిపి ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ (రచ్చబండ) కార్యక్రమం చేపట్టారు. 14వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో బల్ల శ్రీను, పైడి రమణ, పేడాడ రమణి కుమారి, కిరణ్ రాజు, తాడి జగన్నాథరెడ్డి, సేనాపతి అప్పారావు పాల్గొన్నారు.

పట్టాలు రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి పరదేశిపాలెం రెవెన్యూ గ్రామ సర్వేనెంబర్ 179 (శారద నగర్)లో గతంలో ప్రభుత్వం 296 జిఓ ద్వారా మంజూరు చేసిన కొన్ని పట్టాలకు రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారని, కాలనీ పరిధిలో పట్టాలు పొందిన నివాస గృహాలకు ఈ ప్రక్రియ కొనసాగుతోందని, కానీ 34 మంది పట్టాలు పొందినా సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్ చేయడం లేదని వారంతా ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదని వాపోతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి తమ పట్టాలకు రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



బుచ్చయ్యపేట : కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఎస్.రాయవరం : ప్రతిభ చూపిన విద్యార్థులతో టీచర్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం కె.సత్యారావు శనివారం తెలిపారు. పాఠశాలకు చెందిన జి.చంద్రిక, ఎస్.యమున అండర్ -14 కబడ్డీ పోటీలకు, జి.లక్ష్మణరావు, సియ్యాద్రి లత అండర్ -17 వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో పిడి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కొండకర్ల హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థి పి.కావ్య ఎంపికయ్యారు. గాజువాకలో నిర్వహించిన అండర్-14 జిల్లా స్థాయి పోటీల్లో కావ్య క్రీడ నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈనెల 26, 27, 28 తేదీలలో కృష్ణా జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఆమె పాల్గొంటుందని చెప్పారు. కావ్యకు హెచ్ఎం శ్రీనివాసరావు వ్యాయామ ఉపాధ్యాయులు రాము ఉప్పాడ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కృష్ణారావు అభినందనలు తెలిపారు.

ఎస్.రాయవరం : మండలంలోని కొరుప్రోలు జెడ్పి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కప్పల ప్రసాద్ తెలిపారు. గాజువాక జెడ్పీహెచ్ఎస్ శుక్రవారం జరిగిన అండర్-14 విభాగంలో జరిగిన పోటీల్లో కొరుప్రోలు పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి.వైష్ణవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

తైక్వాండోలో తృతీయ బహుమతి

పల్నాడు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి 48 కేజీల తైక్వాండో పోటీల్లో ఇదే పాఠశాల పదో తరగతి విద్యార్థి వై.ఆకాష్ కుమార్ తృతీయ బహుమతి సాధించాడు. వీరిద్దరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అమ్మోరయ్య, ఉపాధ్యాయులు నానాజీ, అప్పలరాజు, రమేష్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బత్తిన సత్యనారాయణ పాల్గొన్నారు.

తగరపువలస : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పుట్‌బాల్, రగ్బీ, నెట్ బాల్ పోటీల్లో అండర్ 17 బాలుర విభాగంలో లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.శ్రావ్య, కె.మహేష్ ఎంపికయ్యారు. డి.వైష్ణవి నెట్ బాల్‌కు ఎంపికయ్యారు. బి.పవన్, బి.సురేంద్ర, కె.శ్రావ్య రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చిల్ల వెంకటరెడ్డి తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంతంశెట్టి సత్యారావు, ఉపాధ్యాయులు రవిశంకర్ పట్నాయక్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు 24 మంది ఎంపిక

భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సన్ స్కూల్ వేదికగా శనివారం జరిగిన యోగాసన పోటీలు ఉల్లాసంగా జరిగాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలకు జిల్లాలకు చెందిన 14, 17 ఏళ్ల లోపు 120 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎంఇఒ -1 ఎం.శివరాణి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 24 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. బాపట్లలో ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఇఒతో పాటు సన్ స్కూల్ కరెస్పాండెంట్ కె.శ్రీనివాస్, ఎస్‌జిఎఫ్ సభ్యులు అభినందించారు. జాతీయ స్థాయిలో ఎంపిక కానున్న విద్యార్థుల్లో ఒక్కో విద్యార్థికి తమ పాఠశాల తరపున రూ.20 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి ఇవ్వనున్నట్లు కరస్పాండెంట్ శ్రీనివాస్ తెలిపారు.



అచ్యుతాపురం : ఎంపికైన కావ్య



తగరపువలస : ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



భీమిలి : అభినందిస్తున్న ఎంఇఒ శివరాణి



సెయింట్ కనకదాస చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఘనంగా సెయింట్ కనకదాస జయంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ భక్తకవి, తత్వవేత్త సెయింట్ కనకదాస జయంతి వేడుకలను శనివారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై, సెయింట్ కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనకదాస సమాజంలో సమానత్వం, సేవా భావం, భక్తి మార్గాన్ని ప్రజలకు చూపిన మహానుభావుడని తెలిపారు. కనకదాసు గురించి నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన ఆలోచనలు ఈనాటి తరానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఆయన తన రచనల ద్వారా కుల వ్యవస్థ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి, ప్రజలలో సమానత్వం కోసం కృషి చేశారని పేర్కొన్నారు ఆయన కేవలం కవి మాత్రమే కాదు, యోధుడు, సంగీతకారుడు, తత్వవేత్త అని తెలిపారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారిణి శ్రీదేవి, బిసి సంఘ నాయకులు, హాస్టల్ సంక్షేమాధికారులు, పాల్గొన్నారు.

గౌరమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో శనివారం శ్రీగౌరమ్మ అనుపు సందర్భంగా సారె ఊరేగింపు కార్యక్రమం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. శతకం పట్టు వద్ద ఉన్న సీతారామలు వారికి గవరపేటలో ఉన్న సీతారాములకు సారె ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటి నుంచి వారికి తోచిన విధంగా పిండి వంటలు తయారు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించి ఆయా ఆలయాల వద్ద ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, గ్రామ పెద్దలు రాజి శ్రీనివాసరావు, సుందరపు గంగాధర్, కుంచ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముస్లిముల సంక్షేమానికి పెద్ద పీట



మసీదును ప్రారంభిస్తున్న ఎం.ఎ.షరీఫ్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ముస్లిముల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్ అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రాజాంలో నూతనంగా నిర్మించిన మజీద్ ఏ జుబైర్‌ను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి ఎం.ఎ.షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ముస్లిములకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. షాది ఖానాలు, మసీదులకు, మసీదుల అభివృద్ధికి ప్రభుత్వం స్థలాలు నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లిముల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. రాజాంలో నిర్మించిన మసీదు నిర్వహణకు తన సొంత నిధులు లక్ష రూపాయలు ఇస్తానని ప్రకటించారు. చింతూరుకు చెందిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ మసీదు నిర్వహణకు రూ.లక్ష, మిందికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త షేక్ సలీం ప్రతినెల మసీదు నిర్వహణకు రూ.10 వేలు అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర ముస్లిం మత పెద్దలు షేక్ ఇస్మాయిల్, షేక్ సుభాన్, షేక్ ఇబ్రహీం, షేక్ ఖాన్ సాహెబ్, షేక్ బాబ్జి,షేక్ వలీ, షేక్ సత్తార్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపిపి డి.నాగేశ్వరి దేవి, తహసీల్దార్ ఎం.లక్ష్మి, మాజీ ఎంపిపి ఎంవివి సత్యనారాయణ, మాజీ జడ్పిటిసి వియ్యపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

షరీఫ్‌ను కలిసిన బాబర్

కశింకోట : ఎపి ప్రభుత్వ ముఖ్య సలహాదారులు ఎంఎ షరీఫ్‌ను టిడిపి అనకాపల్లి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కె రెహమాన్ (బాబర్) శనివారం కలిశారు. రాజం గ్రామంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సాలువాతో సత్కరించారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : బాల్య వివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి అంశాలపై పరవాడ సెక్టర్ పరిధిలోని ప్రభుత్వ హైస్కూళ్లలో కిశోర బాలికలకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్న వయసులో జరిగే వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. శరీర శుభ్రత, మాసికధర్మ సమయంలో పరిశుభ్రత పాటించాల్సిన విధానాలు, ఏ పరిస్థితుల్లో తమపై ఒత్తిడి పడితే ఎలా స్పందించాలో కూడా వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు, టీచర్లు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

'మా ఊరి వెంకన్న' చిత్రం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాక గ్రామానికి చెందిన శివాలయం అర్చకులు వెలవలపల్లి కోటేశ్వర శర్మ నిర్మాణంతో ఈనెల 14న విడుదల కానున్న "మా ఊరి వెంకన్న" చిత్రం పోస్టర్ ఆవిష్కరణ స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఈ చిత్రానికి దర్శక, నిర్మాతలు గోపికృష్ణ, కోటేశ్వరశర్మలు మునగపాక గ్రామానికి చెందినవారు కావడం విశేషమన్నారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ సినిమా తక్కువ సమయంలో రిలీజ్ కావడం గొప్ప విషయమన్నారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ మాట్లాడుతూ చిత్ర యూనిట్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామీణ సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట సోము సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, కళాకారులు దాడి ముసలి నాయుడు, కాంగ్రెసుల జగ్గారావు, బోడ కుర్తి గణేష్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో తిమ్మాపురం గ్రామం బ్రహ్మణకాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు అమలాకంటి అబద్ధం మాట్లాడుతూ పదిలక్షల మండల పరిషత్తు నిధులతో ఈ డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవింద్, కొరుప్రోలు సొసైటీ చైర్మన్ గుర్రం రామకృష్ణ, కూటమి నాయకులు అల్లు నరసింహమూర్తి, పప్పల శివ, వి.గోవింద్, కట్టా అప్పలకొండ, కె.నాగేశ్వరరావు, బ్యాంకు డైరెక్టర్ కోన అప్పలరాజు, ఎస్ రాజు, బాబురావు, ఏ.గోవింద్, బి లోవరాజు, కె శ్రీను, బుజ్జి, రమణ గణేష్, బాబులు, పి గోవింద్ పాల్గొన్నారు.

పొదుపుతోనే ఆర్థిక పురోగతి

ప్రజాశక్తి-సబ్బవరం : పొదుపుతోనే మహిళల ఆర్థిక పురోగతి సాధ్యమని షేర్ మార్క్స్ లిమిటెడ్ సీఈఓ కర్రి జోగినాయుడు అన్నారు. మండలంలోని దేవీపురంలో గల షేర్ మార్క్స్ లిమిటెడ్ (షేర్ పరస్పర సహాయ సహకార కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్)లో పని చేస్తున్న వివిధ మండలాలకు చెందిన సుమారు 50 మంది మహిళా నేతలకు వారి మాతృ సంస్థ షేర్ మార్క్స్ ఆధ్వర్యంలో టిఓటి 2 రోజుల శిక్షణ నిర్వహించారు. షేర్ మార్క్స్ లిమిటెడ్ సీఈఓ కర్రి జోగినాయుడు, సబల సరస్వతి మాట్లాడుతూ మహిళా సాధికారత, సంస్థను బలోపేతం చేసుకోడానికి ఆచరించాల్సిన పద్ధతులు, ఆరోగ్యవంతమైన ఒక ఆర్థిక సంస్థగా ఎదగడానికి వివిధ రంగాలలో ఉన్న అవకాశాలు తెలియజేశారు. ఇంకా ఇలాంటి ట్రైనింగ్‌లు అనేక వేల మందికి అందించాలని అనకాపల్లి ధ్యాన మందిరం నుండి సతీష్, దేవీపురం నుండి ప్రభాకరరావు తెలిపారు.

రాష్ట్రస్థాయి వృత్తి నైపుణ్య పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు బ్యూటీ అండ్ వెల్నెస్ విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర వృత్తి విద్య నైపుణ్య పోటీలకు ఎంపికయ్యారు. సబ్బవరం మండలం ఇరువాడలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన అనకాపల్లి జిల్లా స్థాయి వృత్తి విద్య నైపుణ్య పోటీల్లో పరవాడ బాలిక పాఠశాల విద్యార్థులు దుర్గ, లాస్య, లీల, దీక్షిత, అలేఖ్య, రుచితలు ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారు. ఈ నెల 14న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్ఎం గొల్ల రాజశ్రీ తెలిపారు. విద్యార్థినుల విజయంపై ఇన్‌ఛార్జి హెచ్ఎం నాగలక్ష్మి, ఒకేషనల్ ట్రైనర్ కొముండూరి జ్యోతిర్మయి, బోధనా సిబ్బంది అభినందించారు.



రాష్ట్ర స్థాయి వృత్తి నైపుణ్య పోటీలకు ఎంపికైన విద్యార్థులు



రావలమ్మపాలెం పాఠశాలను సందర్శించిన అధికారులు

టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ (ప్రభుత్వ ఎగ్జామ్స్) ఏ.శ్రీధర్‌రెడ్డి, శనివారం పరిశీలించారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు శ్రీధర్ రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, విద్యుత్, నీటి సౌకర్యం, ఫ్యాన్లు, వసతి తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మణరావు, ఎంజె.రవీంద్రబాబు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరావుకు నేషనల్ లెజెండ్రీ అవార్డు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధి పెదనాయుడుపాలెం జోడిగుళ్ళు గ్రామానికి చెందిన శ్రీబంగారు తల్లి సేవా సమితి వ్యవస్థాపకులు సింగంపల్లి వెంకటరావుకు ఎపి నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఎన్‌జిఓ తరఫున నేషనల్ లెజెండ్రీ అవార్డు ప్రదానం చేశారు. ఎన్జీవో తరఫున సబ్బవరం మండల అధ్యక్షులుగా తాను అందిస్తున్న సేవలను గుర్తించి తాసుబల్లి ఫౌండేషన్ ఛైర్మన్ తాసుబల్లి శంకర్ నాయుడు టీం చేతుల మీదుగా నేషనల్ లెజెండ్రీ అవార్డు అందుకోవడం జరిగినదని ఆయన తెలిపారు. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో ఈ అవార్డును అందజేసి వెంకటరావును ఘనంగా సన్మానించారు.

ముఖ్యమంత్రిని కలిసిన ప్రగడ


ప్రజాశక్తి-అచ్యుతాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శనివారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలను తీసుకువెళ్లారు. ప్రధానంగా స్థానిక పరిశ్రమలలో యువతకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ ఓమ్మివానిపాలెం గ్రామానికి చెందిన లెక్కల పైడికొండకి మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.39,786 వేలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి చెక్కును పెందుర్తి సుజాతనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చేతుల మీదుగా లెక్కల పైడికొండ కుటుంబ సభ్యులకి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఇందల వెంకటరమణ, కర్రి కనకరాజు, మిడతడ మహాలక్ష్మి నాయుడు, రొంగలి దేముడు బాబు, పల్లా రమణ, సబ్బవరపు రమణ, సబ్బవరపు నరసింహమూర్తి, ఎస్.నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా ఇండేసమ్మ పండగ

ప్రజాశక్తి -పరవాడ : మండలంలోని సోమునాయుడు పాలెం గ్రామంలో ఇండేసమ్మ అమ్మవారి పండగ మహోత్సవం శనివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చనలు, హారతులు ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బండారు అప్పలనాయుడు, జానపాల రాము, సిరిపురపు అప్పల నాయుడు, రాజాన శ్రీను, సిరిపురపు కాంతమ్మ, లక్ష్మి, అనిల్, శ్రీను రెడ్డి హరి, సిరిపురపు రమణ, సన్నిబాబు, బండారు సన్నిబాబు, పెదబాబు, సిరిపురపు ప్రియాంక నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

బెల్లం మార్కెట్‌కు పూర్వ వైభవం వస్తుందా?

- తగ్గిన లావాదేవీలు

- కళావిహీనంగా మారిన వైనం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

అనకాపల్లి పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలిపింది బెల్లం మార్కెటే అంటే అతిశయోక్తి కాదు. ఆసియాలోనే రెండో అతిపెద్ద బెల్లం మార్కెట్‌గా నిలిచిన చరిత్ర. నిత్యం ఎగుమతి, దిగుమతి దారులతో కిటకిటలాడిన ఈ బెల్లం మార్కెట్ నేడు కళావిహీనంగా మారిందంటే ఆశ్చర్యమక్కర్లేదు. వందేళ్ల చరిత్ర కలిగిన మార్కెట్‌కి పూర్వవైభవం వస్తుందా? అంటే మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రస్తుతం పాలకవర్గాన్ని నియమించిన నేపథ్యంలో మార్కెట్‌ను ఏమైనా గట్టెక్కిస్తారా? ఉనికిని నిర్వీర్యం చేసేస్తారా? అనే భావన క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతుంది.

ఒకప్పుడు అనకాపల్లి బెల్లం మార్కెట్ పేరు దేశమంతా వినిపించేది. రాష్ట్రానికి చెందిన వారే కాకుండా, పొరుగు రాష్ట్రాల వ్యాపారులు కూడా ఇక్కడి బెల్లం కొరకు క్యూ కట్టేవారు. 1980–2000 మధ్యకాలం వరకూ అనకాపల్లి బెల్లం మార్కెట్ నిజమైన చక్కర హబ్‌గా నిలిచింది. రోజుకు వందల ట్రక్కులు బెల్లంతో నిండిపోయేవి. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల రైతులు కూడా ఇక్కడికి తమ బెల్లం తెచ్చి అమ్మేవారు. మార్కెట్ యార్డ్‌లో వేలాది మంది కూలీలు, దళారులు, బరువులు మోత, తూకాలు పనుల్లో పని చేసేవారు. ఈ కారణంగా స్థానిక హోటళ్ళు, ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం, చిన్న వ్యాపారాలు కూడా ఈ మార్కెట్ మీదే ఆధారపడి నడిచేవి. అనకాపల్లి బెల్లం అంటే క్వాలిటీకి చిహ్నంగా ఉండేది.

అలాంటి మార్కెట్ నేడు కళావిహీనంగా మారింది. క్రమంగా మార్కెట్ ఉనికి తగ్గిపోవడానికి పలు కారణాలు లేకపోలేదు. చక్కెర పరిశ్రమల పెరుగుదలతో చౌకగా అందిన చక్కెర, బెల్లం డిమాండ్‌ను తగ్గించింది. బెల్లం తయారీ చిన్న మిల్లులు లాభదాయకం కాక మూసుకుపోయాయి. దీనికి తోడు ఉత్తర ప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాల నుండి బెల్లం చౌకగా దిగుమతి అవుతుండడంతో అనకాపల్లి బెల్లానికి డిమాండ్ తగ్గింది.



బెల్లం లావాదేవీలు జరుగుతున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

దీనికి తోడు బెల్లం గిట్టుబాటు కాకపోవడంతో మార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరుకు పంట దిగుమతి తగ్గడం కూడా కారణం అనేది పలువురి మాట. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్టీఆర్ మార్కెట్‌కి ఇటీవల పాలకవర్గాన్ని కూడా నియమించారు. ఎంపీ, ఎమ్మెల్యేల సమక్షంలో పెద్ద ఎత్తున ప్రమాణ స్వీకారం కూడా చేశారు. మార్కెట్ భవిషత్తు కోసం ఊకదంపుడు ప్రచారాలు కూడా చేశారు. మరి ఆ ప్రచారానికి తగ్గట్టు మార్కెట్‌కు పూర్వ వైభవం వస్తుందా అంటే వేచి చూడక తప్పదు.

వైసిపి హయాంలో ఆర్భాటమే, అభివృద్ధి లేదు

ప్రజాశక్తి-కె.కోటపాడు : వైసీపీ నాయకులు చెబుతున్నట్లు మేజర్ పంచాయతీ చౌడువాడలో వైసిపి నాయకులు ఆర్భాటాలకే పోయరే తప్ప అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సాధించలేదని ఆ గ్రామ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు ఎద్దేవా చేశారు. శనివారం ఆయన చౌడువాడలో విలేకర్లతో మాట్లాడుతూ తప్పుడు ప్రచారం చేయడంలో వైసిపి నాయకులు ఉన్న ప్రతిభ మరెవరికీ లేదన్నారు. చౌడువాడ గ్రామంలో లో వోల్టేజ్ సమస్యపై ఎన్ని పర్యాయాలు అధికారులకు, అప్పటి వైసీపీ నాయకులకు విన్నవించిన సమస్య పరిష్కారం కాలేదని గుర్తు చేశారు. సబ్ స్టేషన్ తామే ఏర్పాటు చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదగా చౌడువాడ సబ్ స్టేషన్ ప్రారంభించండంతో స్థానిక వైసీపీ నాయకులకు ఏమి చేయాలో తెలియక తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రిగా ముత్యాలనాయుడు చౌడువాడ సబ్ స్టేషన్‌కు అనుమతులు తెస్తామన్నారే తప్ప ఏమీ చేయలేకపోయారన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో చౌడువాడ గ్రామానికి వచ్చిన బండారు సత్యనారాయణమూర్తికి లోవోల్టేజ్ సమస్యను తెలియజేసి, విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయాలని కోరామని, ఆ మేరకు సబ్ స్టేషన్ మంజూరు నిర్మాణం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు, చౌడువాడ పిఎసిఎస్ ఛైర్మన్ రాజి నారాయణమూర్తి, జనసేన నాయకులు కుంచా అంజి, శ్రీను, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చౌడువాడ సర్పంచ్ ఎరుకునాయుడు

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : మండలంలోని లైన్ కొత్తూరు పంచాయతీ, రామకృష్ణాపురం కాలనీలోని శ్రీఅభయ ఆంజనేయ స్వామి ఆలయ 18వ వార్షికోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భారీ మందుగుండు సామగ్రి కాల్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ లావుడు లోవరాజు తెలిపారు.

'పెట్టుబడులకు వైఎస్.జగన్ అడ్డంకి'

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : రాష్ట్రంలో పెట్టుబడులు రావడానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ అడ్డంకిగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. ఈనెల 14, 15 తేదీల్లో పెట్టుబడుల సదస్సుకు అనేక దేశాల నుండి పెట్టుబడిదారులు వస్తున్న సమయంలో ఈ నెల 12న ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆందోళనకు వైసిపి విద్యార్థి విభాగానికి పిలుపునివ్వడం పెట్టుబడిదారులను బెదిరించడానికే అని పేర్కొన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.3000 కోట్లు బకాయిలు పద్దారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, సాలాపు నాయుడు, పిళ్ళా తారకేశ్వరరావు పాల్గొన్నారు.

రుషికొండ భవనాలను అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంగా మార్చాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : విశాఖపట్నం రుషికొండ భవన సముదాయాన్ని అంతర్జాతీయ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంగా మార్చాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 13,542 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూ.451.67 కోట్ల ప్రజా ధనంతో నిర్మితమైన ఈ భవంతిని ఎలా వినియోగించాలి? అంటూ ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని కోరిందని గుర్తు చేశారు. రుషి కొండను అంబేద్కర్ అంతర్జాతీయ స్మారక కేంద్రంగా మార్చి విద్య, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక రంగాలతో పాటు భారతీయ సంస్కృతి, భారతీయ ప్రాచీన, ఆధునిక చరిత్ర, రాజ్యాంగ ఆవశ్యకత ఇత్యాది అన్ని అంశాలతో కూడిన ప్రపంచ స్థాయి వైజ్ఞానిక కళాఖండంగా రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

అధికారిక ఉత్తర్వులు వచ్చే వరకు గోవిందరావే ఎంపిపి

ప్రజాశక్తి - యలమంచిలి : గత నెల 18న ఆర్డీవో సమక్షంలో జరిగిన అవిశ్వాస బలపరీక్షలో ఎంపిపి బోదెపు గోవిందరావుకు వ్యతిరేకంగా మెజార్టీ ఎంపిటిసిలు చేతులెత్తి ఆయన్ని ఓడించారు. స్వచ్ఛందంగా ఆయన ఓటమిని అంగీకరించి నిబద్ధత గల రాజకీయాల్లోనే కొనసాగుతానని వివరించారు. సంఘటన జరిగి 21 రోజులు తర్వాత కూడా ఆయనే ఎంపిపిగా కొనసాగుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చాంబర్ నేమ్ ప్లేట్‌పై ఎంపిపి బోదెప గోవిందరావు పేరు ఉండడాన్ని గమనించిన ప్రజాశక్తి ప్రతినిధి శనివారం మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావును ఫోన్‌లో స్పందించారు. గత నెల 18న ఆర్డీఓ సమక్షంలో జరిగిన ఓటింగ్ వివరాలు అదే రోజు జిల్లా పరిషత్ సిఇఓకు తెలిపామని, సిఇఓ స్టేట్ పంచాయతీరాజ్ కార్యదర్శికి పంపారన తెలిపారు. అయితే అధికారికంగా తుదుపరి ఉత్తర్వులు అందే వరకూ బోదెపు గోవిందరావు ఎంపిపిగానే కొనసాగుతారని, ఉత్తర్వులు అనంతరం ఎంపిటిసిలో ఒకరిని ఎంపిపిగా ఎన్నుకొనే అవకాశం ఉందని చెప్పారు.



ప్రశంసా పత్రాలు చూపుతున్న విద్యార్థులు

పుస్తక ప్రదర్శనలో విద్యార్థులకు ప్రశంస

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అనకాపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పుస్తక మహోత్సవంలో సావిత్రిబాయి పూలే ఘనతను తెలుపుతూ కొండకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మా నిర్వాసితుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఫార్మా సిటీ పరిధిలో భూములు కోల్పోయి నిర్వాసితులుగా నివసిస్తున్న కుటుంబాల సమస్యలు పరిష్కరించాలన కోరుతూ విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్‌కు ఇల్లపు ప్రసాద్ శనివారం వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న జీవనాధార, భూమిపత్రాలు, శ్మశాన స్థల సదుపాయాల సమస్యలను శీఘ్రంగా పరిష్కరించాలని కోరారు. రజకుల వత్తి కొనసాగడానికి దోభీ ఖానా స్థలం కేటాయించాలని కోరారు. 2010 సంవత్సరానికి 18 ఏళ్ల నిండిన యువకులు చాలా మంది ఆ సమయంలో అర్హత ఉన్నా ఇళ్ల పత్రాలు లభించలేదని, వారికి ఇళ్ల స్థల పత్రాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు.

స్టూడెంట్ మాక్ అసెంబ్లీకి చరణ్ ఎంపిక

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో నిర్వహించే స్టూడెంట్ మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి మండలంలోని జంపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి పొలిమేర గుణ చరణ్ ఎంపికయ్యాడు. నియోజకవర్గం స్థాయిలో ఉపన్యాస పోటీలో గుణ చరణ్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు చరణ్‌ను పాఠశాల హెచ్‌ఎం ఏ విజయకుమారి, కె సంపతరావు, కర్రి వీరు నాయుడు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న గుణ చరణ్

అక్రమ అరెస్టులపై మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి: కేసులతో ఉద్యమాన్ని అణిచి వేయలేరని, తుఫాను సాయం అడిగితే అట్రాసిటీ కేసు నమోదు చేయడం దారుణమని, వెంటనే కేసులు ఎత్తివేయాలని మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్య పేటకు చెందిన మత్స్యకారులు కోరారు.మొంథా తుఫాన్ సమయంలో పునరావాస కేంద్రాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గుర్తించిన బాధితులకు భోజనాలు ఏర్పాటు చేశారని, . దీనిలో భాగంగా రాజయ్యపేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన భోజనాలకు సంబంధించి మత్స్యకారులు పిక్కి తాతీలు, పిక్కి రాంచరణ్ తదితరులు సచివాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి సత్యం ను అడిగిన నేపథ్యంలో జరిగిన పరిణామాలపై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు పోలీసులు పలువురు మత్స్యకారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసారు. శుక్రవారం రాత్రి పిక్కి తాతీలు, పిక్కి రాంచరణ్ లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. బల్క్ డ్రగ్ వ్యతిరేక ఉద్యమంలో పిక్కి తాతీలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని మత్స్యకారులు తెలిపారు.బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శనివారం నాటికి 56వ రోజుకు చేరుకోవడంతో, మత్స్యకారులందరూ దీక్షా శిబిరం వద్దకు చేరుకుని అక్రమ అరెస్టులను ఖండించారు. కేసులు ఎత్తివేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, పిక్కి కాశీరావు, మైలపల్లి మహేష్ బాబు, చేపల సోమేష్, చోడిపల్లి కాశీరావు తదితరులు మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు గురించి పంచాయతీ కార్యదర్శిని అడిగామే తప్ప, ఎటువంటి దాడికి పాల్పడలేదని, కులం పేరుతో దూషించలేదన్నారు. ఉద్యమాన్ని అణిచివేసేందుకు రాజకీయ కుట్రలో భాగంగానే ఈ కేసులు పెడుతున్నట్లు భావిస్తున్నామన్నారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. బల్క్ డ్రగ్ రద్దు చేసే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టి,చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకార నాయకులు బి.బాబ్జి, మైలపల్లి బైరాగిరాజు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

అక్రమ అరెస్టు లకు సిపిఎం ఖండన

రాజయ్య పేటలో బల్క్ డ్రగ్స్ పార్క్కు వ్యతిరేకంగా గత యాభై ఐదు రోజులుగా మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి నాయకత్వం వహిస్తున్న పోరాట కమిటీ నాయకులు పిక్కి తాతీలు, పిక్కి రాంచరణ్ లను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు తీవ్రంగా ఖండించారు.

పోలీసుల వలయంలో రాజయ్యపేట

మత్స్యకారులు పిక్కి తాతీలు, పిక్కి రాంచరణ్ లను అరెస్టు చేయడంతో శుక్రవారం రాత్రి నుండి రాజయ్యపేటలో పోలీసు బలగాలను మొహరించారు. రాజయ్యపేట వెళ్లే మార్గంలో పలుచోట్ల పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. డి.ఎస్.పి శ్రీనివాసరావు, సిఐ మురళి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కంప్యూటర్లు ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల:గ్రంధాలయాలు అంటే దేవాలయాలని మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు వడ్డి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తి దారులు కంపెనీ లిమిటెట్ సౌజన్యంలో డిజిటల్ గ్రంధాలయంలో కంప్యూటర్ల ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతానికి 10 కంప్యూటర్లుతో డిజిటల్ గ్రంధాలయంను ఏర్పాటు చేయడం జరిగిందని, ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 4000 మంది విద్యాలకు శిక్షణ ఇవ్వడమే లక్ష్యం పెట్టుకున్నామని. అంతేకాకుండా మరో పది కంప్యూటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు బ్యాచ్లు వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, డిజిటల్ గ్రంథాయాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రంధాలయాలతోనే జ్ఞానాన్ని పెంపొందిచుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పీఏసీఎస్ చైర్పర్సన్ ఉండూరు దేముడు, గోసమాంబ వ్యవసాయ ఉత్పత్తి దారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యచంద్ర

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం:రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సైనికులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇంచార్జ్ రాజాన సూర్యచంద్ర పిలుపునిచ్చారు. శనివారం రామారావు పేటలో జనసేన పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల జనసేన కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనసేన పార్టీ కి కేటాయించిన సీట్లలో శ్రేణులంతా క్రియాశీలంగా పని చేసి గెలిపించుకోవలసిన అవసరం ఉందన్నారు. పార్టీకి నష్టం కలిగించే పనులు ఎవరైనా చేసినట్లయితే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా పార్టీ సెక్రెటరీ అల్లాడి నరేష్, గొలుగొండ మండల అధ్యక్షులు గండం దొరబాబు, పిఏసిఎస్ డైరెక్టర్ రేగుబల్లా శివ, మాపాడ ప్రసాద్, వాసం వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.


పార్టీ బలోపేతానికి కృషి

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ

ప్రజాశక్తి-మాడుగుల:తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రాంరభోత్సవం మండల పార్టీ అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ అభ్యర్థుల గెలుపు సాధించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధిస్థానం 29 పంచాయతీల్లో ఎంపిక చేసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులు అభ్యర్థులనే గెలిపించాలన్నారు. పార్టీకి ఎవరైనా ద్రోహం చేస్తే మా దృష్టికి వచ్చిన వెంటనే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మండలంలోని మాడుగుల నుంచి 100 మంది పార్టీలో కి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేరారు. తుఫాన్లు తగ్గుముఖం పట్టాయని, వడ్డాది తాటిపర్తి రోడ్డును త్వరలో పూర్తి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మండల పార్టీ కార్యదర్శి పుప్పాల రమేష్, టీడీపీ పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మినారాయణ, పలు గ్రామాల సర్పంచ్లు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బండారు



విరాళం అందజేస్తున్న దాత లక్ష్మణరావు

ఉపమాక ఆలయానికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయ అభివృద్ధికి మండలంలో పెద్దబోదిగల్లం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు బొందలపు లక్ష్మణరావు దంపతులు 50 వేల రూపాయల విరాళాన్ని అందచేసారు. శనివారం దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు చేతుల మీదుగా దాతలు విరాళాన్ని ఆలయ ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావుకు అందజేశారు.

జిల్లాస్థాయి స్కిల్ కాంపిటేషన్ పోటీల్లో..

వేంపాడు హైస్కూల్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -నక్కపల్లి:వృత్తివిద్య నైపుణ్యంలో జిల్లాస్థాయి స్కిల్ కాంపిటేషన్ పోటీల్లో వేంపాడు హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారని ప్రధానోపాధ్యాయురాలు యు వరలక్ష్మి తెలిపారు. సబ్బవరంలో జిఎస్ కన్వెన్షన్‌లో జిల్లాలో 68 పాఠశాలల్లో 117 ట్రేడ్లలో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న బాల బాలికలు స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ పోటీల్లో వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సుష్మ నాగవిజయ, రమ్య ,భవిత, దుర్గాప్రసాద్, శివ దత్త రిటైల్ మార్కెటింగ్ విభాగానికి సంబంధించి తయారు చేసిన సూపర్ మార్కెట్ మోడల్ జిల్లా స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. విద్యార్థులు ఈశ్వర్ లోహిత్, ఫణి కుమార్ లు ఎలక్ట్రానిక్స్ విభాగంలో తయారు చేసిన స్మార్ట్ హోం మోడల్ కు, విద్యార్థులు అభిషేక్ ,నాగ కృష్ణ, చరణ్ తేజ లు ఆటోమోటివ్ విభాగంలో తయారు చేసిన కార్ పెడల్ మెకానిజం ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో తీతీయ స్థానం లో నిలిచినట్లు హెచ్ ఎం తెలిపారు. రిటైల్ మార్కెటింగ్ మోడల్ అయిన సూపర్ మార్కెట్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనందున విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈనెల 14వ తేదీన రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు.



సత్తాచాటిన విద్యార్థులు



ఆర్థిక సహాయం అందజేస్తున్న టిడిపి నేతలు

బాధితునికి రూ.10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రాజయ్యపేట గ్రామానికి చెందిన చోడిపల్లి రాజన్న (పెరాలసిస్) పక్షవాతం బారిన పడి ఇబ్బందులు పడుతున్నాడు. ఈ మేరకు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వైద్య ఖర్చు నిమిత్తం పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని శనివారం బాధితుడు రాజన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, సొసైటీ ప్రెసిడెంట్ పిక్కి కోదండరావు, యూనిట్ ఇంచార్జ్ వాసుపల్లి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోచినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయ ఆవరణంలో శనివారం విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఆదిత్య డిగ్రీ కాలేజీ (తుని), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ లో భాగంగా విద్యార్థులు, కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.ఎన్.వి.జి. ఏ దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ జి. మనియా కలసి గ్రంథాలయ పరిసర ఆవరణంలో ఉన్న గడ్డి పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. గ్రంథాలయంలో పుస్తకాల భద్రపరిచే రేఖలను పరిశుభ్రం చేసి, పుస్తకాలను చక్కగా అమరిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్, సామాజిక సేవా కార్యకర్త నానాజీ పాల్గొన్నారు.



ట్రాఫిక్‌లో నిలిచిన బస్‌లు (ఫైల్)

రోలుగుంటలో ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మెయిన్ సెంటర్‌లో పలుమార్లు ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ కారణంగా బస్సులు నర్సీపట్నం నుండి చోడవరం వెళ్లేటప్పుడు అదే సమయంలో చోడవరం నుండి నర్సీపట్నం వెళ్లుటకు రెండు ఒకేసారి వస్తే ఇబ్బందులు తప్పడం లేదు. 2024 సంవత్సరంలో రోడ్డు వెడల్పు చేశారు. మెయిన్ రోడ్డులో ఆంజనేయస్వామి గుడి నుండి మండల కేంద్రం వరకూ రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

అవంతిలో పలు విభాగాలు

పరిశోధన కేంద్రాలుగా గుర్తింపు

ప్రజాశక్తి -నర్సీపట్నం: మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఇంజనీరింగ్ శాఖలను పరిశోధన కేంద్రాలుగా జేఎన్టీయూలో గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. ఈ మెరకు శనివారం జేఎన్టీయూ ఉపకులపతి వివి సుబ్బారావు చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు, ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ, పరిశోధన కేంద్రాలుగా గుర్తింపు లభించడంతో కళాశాలలో ఉన్నత స్థాయి పరిశోధనలతో పాటు అధ్యాపకులకు పీహెచ్డీ, పి.ఎల్ పర్యవేక్షణ పరిశోధన మార్గదర్శకులుగా వ్యవహరించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఉద్యోగ అవకాశాలతో పాటు పరిశ్రమలతో అనుసంధానం వంటి ఎన్నో ప్రయత్నాలు చేకూరుతాయన్నారు. ఈ సందర్భంగా అవంతి కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న అమర్‌నాథ్

మెడికల్ కాలేజీల

ప్రయివేటీకరణను తిప్పికొట్టాలి

-మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మెడికల్ కాలేజీలను ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ధారాధత్వం చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, దీనిని తిప్పి కొట్టేందుకు గాను ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ పాలన పూర్తిగా విఫలమైందని, తండ్రి కొడుకులు ఈ రాష్ట్రాన్ని దోచుకు తింటున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్ళు కావస్తున్నా నేటి వరకు వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు నేటికీ ఒక్క పెన్షన్ ఇవ్వ లేదన్నారు. ఈ రెండేళ్లలో రాష్ట్రంలో ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా కుంటుపడ్డాయని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, తనయుడు లోకేష్‌లు మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ముక్కా మహాలక్ష్మి నాయుడు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జడ్పిటిసిల ఫోరం అధ్యక్షులు దొండా రాంబాబు, రావికమతం ఎంపీపీ పైలరాజు, మండల కన్వీనర్ జగన్నాధరావు, ఆదిమూర్తి, దేవా పాల్గొన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని బెన్నవరం పంచాయతీ పరిధి బొర్రమామిడి గ్రామంలో తాగునీటి పథకాన్ని ఏపి టూరిజం డైరెక్టర్ కిళ్ళు వెంకట రమేష్ నాయుడు శనివారం ప్రారంభించారు. సర్పంచ్ బచ్చుల సన్యాసమ్మ, కూటమి నాయకులు పూజారి నారాయణమూర్తి, డిప్పల రాజు, జర్త రాజేంద్ర, ముప్పల సత్తిబాబు, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ మెరుగునకు కృషి చేయాలి

- ఆర్‌జెడి విజయ భాస్కర్



మాట్లాడుతున్న విజయ భాస్కర్

ప్రజాశక్తి-నక్కపల్లి: విద్యార్థులకు పునాది అభ్యాసాన్ని పెంచడానికి ప్రారంభ బాల్య విద్యను బలోపేతం చేయడం, విద్యా వ్యవస్థ మెరుగునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్ జె డి విజయ భాస్కర్ సూచించారు. మండలంలో చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులో భాగంగా ప్రపంచ బ్యాంకు సహకారంతో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. నక్కపల్లి, మునగపాక, యలమంచిలి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాలకు చెందిన మండల విద్యా శాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆర్ జె డి విజయ భాస్కర్, డిప్యూటీ డిఇఒ అప్పారావు, ఎంఈఓ కే.నరేష్ ఈ శిక్షణా తరగతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి విజయభాస్కర్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాల గురించి వివరించారు. టీచ్ టూల్ అనేది ఒక అభ్యసన సాధనం అని తరగతిగది పరిశీలనా సామర్థ్యాన్ని ఉపాధ్యాయులు అవగాహన చేసుకో వాలన్నారు. బోధనా పద్ధతులలో లోపాలను తెలుసుకోవడానికి, మరింత సమర్ధవంతంగా బోధన చేయడం ఈ టీచ్ టూల్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. బోధనా సహాయాలు, చిత్రాలు, డి.వి.డి వంటి భౌతిక వస్తువులు కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతీ ఉపాధ్యాయుడికి తెలిసి ఉండాలన్నారు. బోధనా విధానంలో ఆధునికత సంతరించుకున్న నేపథ్యంలో వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కోర్స్ డైరెక్టర్ గా వేమగిరి నూకరాజు, పర్యవేక్షకులుగా నక్కపల్లి విద్యాశాఖ అధికారి-2 రుత్తల నాగన్న దొర, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులుగా బాలాజీ వ్యవహరించారు.

ముగిసిన హార్ట్ రిథమ్ సొసైటీ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం వేదికగా నిర్వహించిన మూడు రోజుల ఇండియన్ హార్ట్ రిథమ్ సొసైటీ వార్షిక జాతీయ సదస్సు శనివారంతో విజయవంతంగా ముగిసింది. 'ఒక రిథమ్, ఒక లక్ష్యం : సహకారంతో ఎలెక్ట్రోఫిజియాలజీ అభివృద్ధి' అనే అంశంతో జరిగిన ఈ సదస్సుకు దేశ, విదేశాల ప్రముఖ హృదయ నిపుణులు, పరిశోధకులు హాజరయ్యారు. హృదయ రిథమ్ లోపాల నిర్వహణలో తాజా పురోగతులు, కాథెటర్ అబ్లేషన్ వంటి నూతన సాంకేతికతలు, ఎలెక్ట్రోఫిజియాలజీ రంగాన్ని మారుస్తున్న అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలపై లోతైన చర్చలు జరిగాయి. సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ అల్లంశెట్టి సురేష్ (సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్టు, ఎలెక్ట్రోఫిజియాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్) మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక ఈ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ సి.నరసింహన్ మాట్లాడుతూ సదస్సులో జరిగిన సజీవ చర్చలు, సహకారాలు దేశవ్యాప్తంగా హృదయ రిథమ్ రుగ్మతల చికిత్సా ప్రమాణాలను మెరుగుపరచనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు నిర్వహణ అధ్యక్షులు డాక్టర్ అజయ్ నాయక్, 305 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అమెరికా, తైవాన్, యుకె, ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి దేశాల నుంచి సీనియర్ ఎలెక్ట్రోఫిజియాలజిస్టులు ఫ్యాకల్టీగా పాల్గొని వారి అనుభవాలను, పరిశోధనా ఫలితాలను పంచుకున్నారు.



హాజరైన ప్రముఖ వైద్యులు

పెట్రేగుతున్న కూరగాయల ధరలు

నెల రోజుల్లో రెట్టింపు

ప్రజాశక్తి - యలమంచిలి : ఒక పక్క కార్తీక మాసం, మరో పక్క మొంథా తుపాను కారణంగా మార్కెట్లో కూరగాయల ధరలు రెట్టింపు పలుకుతున్నాయి. నెల రోజుల క్రితం దాదాపు ఎక్కువ కూరగాయలు కేజీ 30 - 40 రూపాయలు పలికిన ధరలు నేడు 60 - 80 రూపాయలు పలుకుతున్నాయి. శనివారం యలమంచిలి మార్కెట్లో పలుకుతున్న ధరలు గురించి హెూల్ సేల్, రీటైల్ మార్కెట్లో ధరల గురించి ప్రజాశక్తి వాకబు చేసింది. తుపాను మూలంగా కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో వాటి ధరలు అమాంతం పెరిగాయన్నారు. కార్తీక మాసంలో కాస్తో కూస్తో ధరలు పెరుగుతుంటాయని, అయితే ఈ సారి మొంథా తుపాను మూలంగా తీవ్ర కొరత ఏర్పడిందని వ్యాపారులు తెలిపారు. ఉల్లి రూ.20, టమోట రూ.30, బంగాళాదుం రూ.30 ధరలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయి. కేజీ 40 రూపాలయలు పలికే బీర ఇప్పుడు 80 రూపాయిలకు చేరింది. కేజీ వంగ రూ.60, బర్బాటి రూ.80, బెండ రూ.60కు విక్రయిస్తున్నారు. వరంగల్, ఖమ్మం, గుంటూరు, రాజమండ్రి కూరగాయల మార్కెట్‌లకు దిగుమతి తగ్గటంతో ఈ కొరత ఏర్పడిందని వ్యాపారులు చెప్పారు. కార్తీక మాసం పూజలు చేసే వారు మాంసాహారం పూర్తిగా మానేయడంతో కూరగాయల వినియోగం ఎక్కువ కావడం కూడా కారణమని వ్యాపారులు వివరించారు. అయ్యప్ప భక్తులు, భవానీ భక్తులు కూడా కూరగాయ వంటకాలపైనే ఆధార పడడం కూడా మరో కారణంగా వారు చెప్పారు.



మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

శ్రీప్రకాష్‌లో ముగిసిన రిమ్ జిమ్ వేడుకలు

ప్రజాశక్తి-పాయకరావుపేట : పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థలో గత 5 రోజులుగా నిర్వహిస్తున్న రిమ్ జిమ్ వేడుకలు శనివారం ముగిశాయి. ఇందులో శ్రీప్రకాష్ విద్యా సంస్థల తుని, పాయకరావుపేట, అన్నవరం విద్యార్థులు సుమారు 5,500 మందికి సాహిత్యం, సంగీతం, ఆటలు, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాల మీద జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలలో 31 రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు ది హిందు గ్రూప్ (ఎస్ అండ్ డి) వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ ఆర్యాల, జెఎన్‌టియు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జివిఎస్ఆర్ దీక్షితులు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం అతిధులకు జ్ఞాపికలు బహూకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, రిమ్ జిమ్ కన్వీనర్ నీలాదేవి, అకడమిక్ ఇంచార్జిలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సమస్యలపై కార్పొరేటర్‌కు వినతి

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం సాయినగర్ కాలనీలో సమస్యలపై ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌కు కాలనీవాసులు విన్నవించారు. వర్షాకాలం వచ్చిందంటే తమకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని, రోడ్లు పాడైపోవడంతో పైపులైన్ నీరు, వర్షపు నీళ్లు నిలిచిపోయి ముంపు రూపంలో ఇళ్లలోకి చేరుతుందని, దీంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ శ్రీనివాస్ కాలనీలో రోడ్ల పునర్నిర్మాణం, డ్రైనేజీ లైన్ ఏర్పాటు కోసం జివిఎంసి అధికారులతో మాట్లాడి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.